క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చండూరు : మండలంలోని పుల్లెంల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటును తాకట్టు పెట్టొద్దు

నల్లగొండ టౌన్ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తాకట్టు పెట్టవద్దని ప్రజాస్వామ్య ఫోరం జిల్లా కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. మంగళవారం స్థానికంగా జరిగిన ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం భారత రాజ్యాంగం ఓటు హక్కును ఆయుధంగా కల్పించిందన్నారు. ఆ ఆయుధాన్ని దుర్వినియోగం చేయవద్దని కోరారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన గట్టిగుండ్ల గోపాల్(43) అనారోగ్యానికి గురై నల్లగొండ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కాగా ఆయన కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పంపిన రూ.10 వేల నగదును ఎంపీపీ కరీంపాష అందజేశారు. అదేవిధంగా గోపాల్ కుటుంబ సభ్యులకు తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ రూ.10 వేల నగదు అందజేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి గ్రామంలో బుధవారం మాల్ పద్మావతి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని 36వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుకు చెందిన ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ భిక్షం, సీఓ జ్యోతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సింహగౌడ్

మునుగోడు : మండలంలోని జక్కలవారిగూడెం, ఊకొండి, కోతులారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పలువురు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, మేకల ప్రదీప్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నకిరేకల్ : జాతీయ డెంగ్యూ డే సందర్భంగా నకిరేకల్‌లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. గుంతల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు తయారవుతాయని, దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఓగోడు ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ రాపోలు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

చౌటుప్పల్ : ఈ నెల 22న భువనగిరిలో నిర్వహించనున్న రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్నేపల్లి లింగారెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని ఎస్ఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు సుర్కంటి శ్రీధర్‌రెడ్డి, సామ మహిపాల్‌రెడ్డి, రంగారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

నిధులున్నా.. ఉపయోగం సున్నా!

- ఎస్ఎఫ్‌సీ నిధులను ఫ్రీజింగ్ చేసిన ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సర్పంచ్‌లు
- బ్యాంకుల్లో వేసిన చెక్కులు పాస్‌కాక అవస్థలు



సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

మునుగోడు : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. నిధులు పేరుకు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాల్లో కనిపిస్తున్నా విత్‌డ్రా కావడం లేదు. ఆర్థిక సంఘం నిధులు విత్‌డ్రా చేయకుండా బ్యాంక్ ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయడం వల్లే నిధులు డ్రా చేయలేకపోతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు

ఫిబ్రవరి మాసం నుంచి ఫ్రీజింగ్..

గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులను నెలానెలా గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేసేలా ప్రణాళిక రూపొందించింది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు 12 నెలల నిధులు జమచేయాల్సి ఉండగా కేవలం 6 నెలల నిధులు మాత్రమే జమ చేసింది. అందులో సర్పంచ్‌లు కొన్నింటిని ఖర్చు చేయగా మిగిలిన నిధులు ఖర్చు చేసేందుకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు పూర్తయిన తరువాత ఆ నిధులను డ్రా చేసేందుకు చెక్కులు బ్యాంకులో వేస్తే గత ఫిబ్రవరి మాసం నుంచి నిధులు విత్ డ్రా కావడం లేదు. దీంతో గత్యంతరం లేక కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోపాటు గ్రామ పంచాయతీ సాధారణ నిధులను వినియోగించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆ నిధులతో మంచి నీరు, విద్యుత్ బిల్లులు, వీధి దీపాలు, సిబ్బంది వేతనాలు తప్ప ఇతర పనులు చేసేందుకు నయా పైసా మిగలడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. చిన్న గ్రామ పంచాయతీలకైతే కనీసం అత్యవసర పనులకు అవసరమైన నిధులు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలవ్యాప్తంగా రూ.38,76,235 నిధులు

మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల జనాభా ప్రకారం ప్రభుత్వం జమచేసిన ఎస్ఎఫ్‌సీ నిధులు మొత్తం రూ.38 లక్షల 76 వేల 235 గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్నాయి. ఫ్రీజింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని మండలంలోని సర్పంచ్‌లు కోరుతున్నారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం



9 నెలల క్రితం మా గ్రామంలో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేశా. ఆ డబ్బులు ఎస్ఎఫ్‌సీ నిధుల నుంచి తీసుకునేందుకు ఆన్‌లైన్‌లో చెక్కు వేశాం. కానీ ఇప్పటి వరకు చెక్కు పాస్ కావడం లేదు. రోడ్డు పనులకు తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేకపోతున్నా. ఇప్పటికైనా ఫ్రీజింగ్ ఎత్తివేస్తే బాగుండు.

– పగిళ్ల భిక్షం, సర్పంచ్ కల్వకుంట్ల

త్వరలో ఎత్తివేస్తారు



నెల రోజుల క్రితం గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని ఖాతాలను ఫ్రీజింగ్‌లో పెట్టారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, సాధారణ నిధుల వినియోగానికి అవకాశం కల్పించారు. అదే తరహాలో ఎస్ఎఫ్‌సీ నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేస్తారు. సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఎం. విజయ భాస్కర్, ఎంపీడీఓ మునుగోడు

పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చిట్యాలలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిచ్చి అనేక పథకాలను అమలు చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు, 34 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, సర్పంచ్‌లు బోయపల్లి వాణి శ్రీనివాస్‌గౌడ్, మర్రి జలంధర్‌రెడ్డి, ఉయ్యాల సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ గొలనుగొండ దశరథ, ఉప్పరబోయిన అంజమ్మ స్వామి, దేశబోయిన స్వరూపనర్సింహ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

నార్కట్‌పల్లి : సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) విధానంపై ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఐకేపీ, పోలీస్, ఆర్టీసీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా అకస్మాత్తుగా కార్డియాక్ట్ అరెస్ట్‌తో ఇప్పటివరకు 15లక్షల మంది మృత్యువాత పడ్డారని అన్నారు. సీపీఆర్ చేయడం అందరూ నేర్చుకుంటే విలువైన ప్రాణాన్ని కాపాడుకోవచ్చన్నారు. నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, రిసోర్స్ పర్సన్ డాక్టర్ జి. రామకృష్ణ, డాక్టర్లు శ్రీనివాస్, సురేందర్. సుల్తానా, సామాజిక ఆరోగ్య అధికారి శ్రీరాములు, తహసీల్దార్ పులి సైదులు, డిప్యూటీ తహసీల్దార్ మురళీమోహన్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కురుమర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నర్సింగ్ సాయికిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మృతుడి కుమారుడు స్వాతిక్‌కు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, సర్పంచ్ గుర్రం సైదులు, ఎంపీటీసీ బీరెల్లి రాజ్యలక్ష్మిప్రసాద్, ఉప సర్పంచ్ కొంపెల్లి వెంకన్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపడుతున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నీలగిరి పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ నుంచి పెద్ద బండ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను త్వరలోనే మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని, పనులు సకాలంలో పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కరెంట్ స్తంభాలు వేయడంతో పాటు వెంటనే కొత్త లైన్ వేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పాత పోల్స్‌ను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శైలజ

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం డీఆర్‌డీఏ ఏపీడీ శైలజ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు బి. గిరిబాబు, విమల, కవిత, రాజు, వరమ్మ, మద్ది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి అక్కెనపల్లి వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం కొనసాగాయి. మంగళవారం వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన రేగట్టె జట్టుకు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగట్టె గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

కట్టంగూర్ : సీఎం కప్ క్రీడల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడలను ఎంఈఓ మేక నాగయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాంమోహన్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ ఉన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. క్రీడలను ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్ రావు, ఎంపీఓ ఝాన్సీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు రాంనరేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని విద్యానగర్, చైతన్యనగర్, మణికంఠ, శాంతినగర్ కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ తాడూరి శిరీషరమేష్, ఢిల్లీ శంకర్‌రెడ్డి, మండలోజు సుభాష్, ప్రతాప్‌రెడ్డి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తొర్పునూరి నర్సింహ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం దామెర గ్రామంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజ్, ఎంపీపీ గుత్తా ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, సింగిల్‌విండో చైర్మన్లు చింతల దామోదర్‌రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, పీఏసీఎస్ చైర్మన్ జంగారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు, ఎంపీడీఓ రాములు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేలకు వినతి



ఎమ్మెల్యే కంచర్లకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు



ఎమ్మెల్యే చిరుమర్తికి వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

నల్లగొండ టూటౌన్ : తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవాలని కోరుతూ నల్లగొండ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వీఆర్ఏలు మంగళవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శంకర్, వనిత, సుహాసిని, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : తమకు పే స్కేల్ అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ నకిరేకల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్ఏలు మంగళవారం నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్కట్‌పల్లి, కట్టంగూర్, చిట్యాల, రామన్నపేట, నకిరేకల్, కేతేపల్లి మండలాలకు చెందిన వీఆర్ఏలు ఉన్నారు.

‘బ్రాహ్మణ వెల్లంల’కు జీవం పోసింది వైఎస్సార్



మాట్లాతున్న దైద రవీందర్

నకిరేకల్ : మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని 107 గ్రామాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి మేరకు 2007లోనే జీవం పోసింది దివంగత సీఎం వైఎస్సార్ అని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లోరైడ్ మహమ్మారితో బాధపడుతున్న మునుగోడు, చిట్యాల, నార్కట్‌పల్లి, రామన్నపేట, శాలిగౌరారం, కట్టంగూరు మండలాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు, 107 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి అప్పటి సీఎం వైఎస్సార్‌తో శంకుస్థాపన చేసిన విషయం మరిచిపోవద్దన్నారు. తెలంగాణ వచ్చాక ఈ ప్రాజెక్టు పూర్తయితే కోమటిరెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందో అని ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, దైద స్వప్న, యూసఫ్, అబ్దుల్ మజీద్, ఉపేందర్‌రెడ్డి, వంటిపాక సతీష్, నక్షత్, పశుపతి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యాలయం ముట్టడి



తిప్పర్తిలో ధర్నా చేస్తున్న వీఓఏలు

రామగిరి (నల్లగొండ): తమ సమస్యలు పరిష్కరించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వీఓఏలు మంగళవారం తిప్పర్తి మండల సమాఖ్య కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ నెల రోజులుగా తాము సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గణేశ్, వీఓఏలు మంత్రాల మంగమ్మ, ఎలుక కోటిరెడ్డి, సామ్రాజ్యం, ప్రవంతి, సునీత, సైదులు, రమణ, నాగరాజు, రమణ, సువర్ణ, మల్లయ్య, రాణి, జయమ్మ, అశ్విని, ఖాసీంబీ, రేణుక, వసంత, పుష్ప, వసుమతి, నాగమ్మ, అన్నపూర్ణ, పార్వతి పాల్గొన్నారు.

30వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె

మర్రిగూడ : మండలంలోని వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 30వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో రంగినేని చంద్రకళ, గంటా మంజుల, పద్మ, జ్యోతి, సుమలత, మానస, విజయ, సిరియాల, పురుషోత్తం పాల్గొన్నారు.

శాలిగౌరారం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఓఏలు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

శీతల పానీయాలకు భలే గిరాకీ



కొబ్బరి బోండాలు అమ్ముతున్న వ్యాపారి



నకిరేకల్‌లో కుండల విక్రయాలు



పుచ్చకాయలు కొంటున్న ప్రజలు

నకిరేకల్ : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు జనాలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ఎంత ఎండ వేడిమి ఉన్నా ప్రజలు మాత్రం తమ అవసరాల నిమిత్తం బయటకు రాక తప్పడం లేదు. వారం రోజులుగా ఎండలు మరింత తీవ్రమయ్యాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు మధ్యాహ్నం సమయంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కట్టంగూర్, శాలిగౌరారం, కేతేపల్లి, తిప్పర్తి, తదితర మండలాల గ్రామీణ ప్రజానీకం నిత్యం వ్యాపారాలు, వివిధ అవసరాల నిమిత్తం నకిరేకల్ పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. వారు ఎండ వేడిమిని తట్టుకోలేక శీతల పానీయాలను సేవిస్తున్నారు.

జోరుగా విక్రయాలు

నకిరేకల్ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కూల్ డ్రింక్స్, పళ్ల రసాలు, ఐస్‌క్రీం, లస్సీ, చెరకు రసం, కొబ్బరి బోండాలు, పుచ్చకాయల విక్రయ దుకాణాలు వెలిశాయి. పుచ్చకాయలు, కొబ్బరి బోండాలను తోపుడు బళ్లపై విక్రయిస్తున్నారు. ఒక్కో పుచ్చకాయ కేజీకి రూ.25 చొప్పున, సైజును బట్టి ఒక్కో కాయ రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇక పేదోడి ఫ్రిడ్జ్ అయిన మట్టి కుండలకు గిరాకీ బాగా పెరిగింది. ఒక్కో కుండ రూ.50 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. కొబ్బరి బోండాల దుకాణాల దగ్గర సైతం రద్దీగా ఉంటోంది. ఒక్కో బోండం రూ.40 నుంచి రూ.50 చొప్పున కాయ సైజ్‌ను బట్టి అమ్ముతున్నారు. అయితే అవసరమైతేనే ఇళ్లనుంచి బయటకు రావాలని ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే జాగ్రత్తలు పాటించాలంటున్నారు.

తగిన జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఎండాకాలం పూర్తయ్యే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎండలో తిరగొద్దు. బయటకు వెళ్లినప్పుడు తెలుపు, లైట్ కలర్ దుస్తులు, తలకు టోపీ ధరించాలి. ఎక్కువగా నీరు తాగాలి. కొబ్బరినీళ్లు, ఉప్పు, చక్కర కలిపిన ద్రావణాలు, కర్బూజా, ఇతర పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో ఆల్కహాల్, కూల్‌డ్రింక్స్, టీ, కాఫీలు తీసుకోకూడదు.

– శ్రీనాథ్ నాయుడు, సూపరింటెండెంట్, 100 పడకల వైద్యశాల, నకిరేకల్

రేపు మెగా జాబ్ మేళా

మిర్యాలగూడ : పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 18న ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ మంగళవారం తెలిపారు. పదో తరగతిలో 60శాతం మార్కులు, ఇంటర్(ఎంపీసీ, బైపీసీ)లో 2022– 23 సంవత్సరంలో 55శాతం మార్కులు , 20 సంవత్సరాలలోపు కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. మేళాకు హాజరయ్యే వారు పాస్‌ఫొటో, బయోడేటా, ఆధార్‌కార్డు జీరాక్స్, విద్యార్హతల సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలన్నారు. కనీస వేతనం రూ.11వేలు, మొదటి రెండేళ్ల ఉచిత వసతి, వాహన సౌకర్యంతోపాటు డిగ్రీలో బీఎస్సీ గ్రూపులో చదివేవారికి సంస్థ రాయితీలు కల్పిస్తుందన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

చిట్యాల : అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న వారికి తక్షణ ప్రథమ చికిత్సగా చేయాల్సిన సీపీఆర్‌పై చిట్యాలలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, అంగన్‌వాడీ సిబ్బందికి చిట్యాల, వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు కిరణ్‌కుమార్, నర్సింహ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

శాలిగౌరారం : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు గడిచినా నేటికి సగం ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి అదనపు తూకం నిషేధించి రైతులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం

కేతేపల్లి : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన్న వెంకులు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లారీల కొరత కారణంగా కాంటాలు వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి మారయ్య, సభ్యులు కర్ర బాలయ్య, ఆదిమళ్ల సుధీర్, చెవుగోని నాగయ్య, కోట లింగయ్య, చెర్కు సత్తయ్య, గోళి యల్లయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 25లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా రేగట్టె నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా రేగట్టె నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాంబాబు ప్రకటించారు. రెండేళ్ల క్రితం చైర్మన్ గంటా నర్సిరెడ్డి మృతి చెందడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న శంకర్ చైర్మన్‌గా కొనసాగారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికలో 1982, 1994లో చైర్మన్‌గా పనిచేసిన రేగట్టె నారాయణరెడ్డి 3వసారి పీఏసీఎస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా ఎన్నికైన నారాయణరెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, సర్పంచులు మేడి పుష్పలత, మల్గ బాలకృష్ణ, కొత్త నర్సింహా అభినందించారు. నూతన పాలక మండలి సభ్యులకు ఎన్నికల అధికారి రాంబాబు నియామక పత్రాలను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా రేగట్టె నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ సారా శంకరయ్య, డైరెక్టర్లుగా అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, దండు లింగయ్య, ఉప్పల రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఉదర అంజయ్య, పన్నాల కృష్ణారెడ్డి, ఎం.అండాలు, ఎం.లక్ష్మమ్మ, పి.శంకర్‌రెడ్డి, దాసరి మల్లేషులు ఎన్నికయ్యారు.



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి